సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



సాయన్నపాలెంలో చోరీ

భీమడోలు మండలం పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంలో జరిగిన చోరీలో 12 కాసుల బంగారు అభరణాలు అపహరణకు గురయ్యాయి. 8లో ▸



మళ్లీ గోదావరికి వరద

గోదావరికి మళ్లీ వరద పోటెత్తింది. తెలంగాణ ప్రాజెక్ట్‌ల నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో రెండు రోజులుగా వరద ప్రవాహం పెరుగుతోంది. 8లో ▸



ఎరువు మోతాదు మించితే..

వరి సాగులో మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల నష్టం చేకూరుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. 8లో ▸

ప్రతి ఇంటా ఆరోగ్య సురక్ష

- 16న ప్రారంభించిన ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంతవరకూ 55 సచివాలయాల పరిధిలో సర్వే
- 30 నుంచి నవంబరు 13 వరకు క్యాంప్‌లు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజల ఆరోగ్యాన్ని ఆకాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి వస్తే ఉచితంగా వైద్యం చేయడంతోపాటు జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి స్థానికంగా వైద్యం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా చేసే సర్వే ఈ నెల 16న ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా మొదటిగా గ్రామీణ ప్రాంతాల్లో 41 సచివాలయాలు పరిధిలోని గ్రామాల్లో, పట్టణాల్లో 14 సచివాలయల పరిధిలో వార్డుల్లో సర్వే ముమ్మరంగా సాగుతుంది.

ఈ నెల 30 నుంచి వైద్య క్యాంపులు

ఈ నెల 30 నుంచి వైద్య క్యాంపులు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 384 క్యాంపులు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 13 వరకు ఈ క్యాంపులు ఉంటాయి. వైద్య క్యాంపులు జరిగే షెడ్యూల్ బట్టి ఆయా ప్రాంతాల్లో ఇంటింట సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి స్థానికంగా ఏర్పాటు చేసే వైద్య క్యాంపుల్లో ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తారు. ఈ క్యాంపుల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు ఉంటారు. రోగి ఆరోగ్య పరిస్థితి బట్టి మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్, ఇతర ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు.



తాడేపల్లిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న దృశ్యం



నర్సాపురం మండలం గొందిలో సర్వేలో పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

వైద్య క్యాంపుల షెడ్యూల్..

తేదీ	క్యాంపులు	తేదీ	క్యాంపులు
సెప్టెంబర్ 30	26	అక్టోబర్ 18	17
అక్టోబర్ 3	20	అక్టోబర్ 19	16
అక్టోబర్ 4	20	అక్టోబర్ 20	14
అక్టోబర్ 5	20	అక్టోబర్ 21	17
అక్టోబర్ 6	21	అక్టోబర్ 24	8
అక్టోబర్ 7	20	అక్టోబర్ 25	4
అక్టోబర్ 9	19	అక్టోబర్ 26	10
అక్టోబర్ 10	19	అక్టోబర్ 27	10
అక్టోబర్ 11	19	అక్టోబర్ 28	6
అక్టోబర్ 12	21	అక్టోబర్ 30	6
అక్టోబర్ 13	19	అక్టోబర్ 31	4
అక్టోబర్ 16	18	నవంబరు 2	1
అక్టోబర్ 17	18		

మెరుగైన వైద్యమే లక్ష్యం : కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికి వాటిని తేలిగ్గా తీసుకుని వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యంగా ఉంటారు. కొందరికి వ్యాధి ఏంటో తెలియకుండా ఇబ్బంది పడుతుంటారు. క్యాన్సర్ లాంటి వ్యాధిని ఆదిలోనే గుర్తించి వైద్యం అందించడం, రక్తహీనత కలిగిన వారిని గుర్తించి వారికి వైద్యం అందించడం, వ్యాధి ఏదైన ముందుగానే పసిగట్టి సకాలంలో వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం.

క్యాంపులకు ముందే సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 55 సచివాలయ పరిధిలో సర్వే ప్రారంభించాం. ఈ నెల 30 నుంచి నిర్వహించే వైద్య క్యాంపుల షెడ్యూల్ మేరకు ముందే ఆయా ప్రాంతాల్లో సర్వే జరుగుతుంది. క్యాంపుల్లో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవతం చేయడానికి చర్యలు తీసుకున్నాం.

– డి.మహేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, భీమవరం

సర్వే ఇలా..

ముందుగా వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఏఎన్‌ఎంలు ఇళ్లు సందర్శించే షెడ్యూల్ తెలియజేస్తున్నారు. ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యల వివరాలను కేస్ షీట్‌లో నమోదు చేస్తున్నారు.

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ఎంపీడీఓ, తహసీల్దార్, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా ఉన్నారు. వారు సర్వే టీంకు సూచనలు, సలహాలు ఇస్తూ సర్వే సక్రమంగా, వేగంగా జరిగేలా చూస్తున్నారు.

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలి



విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, భీమవరం: బడి ఈడు పిల్లలంతా తప్పనిసరిగా బడిలో ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లాలో 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న వారంతా బడిలోనే ఉండాలనే అంశంపై విద్యా శాఖ అధికారులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన మండలాల విద్యాశాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మానవాభివృద్ధిని సూచించే అంశాలలో విద్య, వైద్యం కీలక పాత్ర పోషిస్తాయన్నారు. టెన్త్, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు తిరిగి అడ్మిషన్లు కల్పించి చదువుకునే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకూ విద్యార్థుల డేటాను ఒకే చోట లభ్యమయ్యేలా ప్రక్రియ చేట్టాలన్నారు. మండలాలవారీగా చైల్డ్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే టెన్త్, ఇంటర్, ఐటీఐ ఫెయిలై మధ్యలో మానేసిన 4 వేల మందిని తిరిగి జాయిన్ చేయగా ఇంకా మిగిలిన 2 వేల మందిని ఈ నెల 25 లోగా జాయిన్ చేసి నూరు శాతం పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, ఆర్‌ఐవో బి.చంద్రశేఖర్, డీవీఈవో ఎ.చంద్రమూర్తి, వివిధ మండలాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కౌన్సిలేషన్ అధికారిగా దాయన చంద్రజీ



దాయన చంద్రజీ

భీమవరం (ప్రకాశం చౌక్): వృద్ధుల పరిరక్షణ సంక్షేమం కోసం పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం డివిజన్‌కు ట్రిబ్యునల్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిలేషన్ అధికారిగా దాయన చంద్రజీని నియమిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఎస్.ఎస్.సత్యనారా యణ, చిట్టి వెంకయ్యలు ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. చంద్రజీని నియమించినందుకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం, భీమవరం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నల్లం వెంకటకృష్ణ నాగేశ్వరరావు, బోనం పాండురంగారావు, డాక్టర్ మట్లపూడి సత్యనారా యణ, తాళ్లపూడి గాంధీ, డాక్టర్ కట్రెడ్డి సత్యనారాయణ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

గల్లా జయదేవ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

ఏలూరు (టూటౌన్): పార్లమెంటులో టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ ఏలూరు జిల్లా నాయకులు పితాని దుర్గాప్రసాద్, చదలవాడ వెంకటరమణ, తోట సుధీర్‌లు ఒక ప్రకటనలో ఖండించారు.రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు, రాజకీయ కుట్ర పూరితంగా చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేసిందని ఎంపీ జయదేవ్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రూ.371 కోట్ల స్కిల్ స్కాంపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు విచారించి సీఐడీకి ఇచ్చిన నివేదిక ఆధారంగా అన్ని కోణాల్లో విచారించి తగిన సాక్ష్యాధారాలు సేకరించి కోర్టుకు సమర్పదించారన్నారు. దుర్యోధనుడు మంచోడని దుశ్శాసనుడు, శకుని సాక్ష్యం చెప్పినట్లుగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీడీపీ వ్యవహారం ఉందని విమర్శించారు. చంద్రబాబుకు తోడు దొంగల్లా సుమన్ బోస్, ఖాన్విల్కర్‌లు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన వాళ్ల స్టేట్‌మెంట్లనే పతాక శీర్షికలుగా ప్రచురిస్తున్న ఈనాడు, దాని తోక మీడియా కథనాలను ఖండించారు. వాస్తవానికి సుమన్ బోస్ అసలు బండారాన్ని బయటపెడుతూ సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఇప్పటికే ఇటు సీఐడీకి, అటు న్యాయస్థానానికి కూడా వాంగ్మూలాన్ని ఇచ్చిందని.. దాన్ని టీడీపీ తొక్కిపెడుతోందని వారు తమ ప్రకటనలో విమర్శించారు.

టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

సాక్షి, భీమవరం: పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 మార్చిలో నిర్వహించే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 30 లోగా చెల్లించాలన్నారు. రూ.50 ఫైన్‌తో అక్టోబర్ 1 నుంచి 5 వరకు, రూ.200 ఫైన్‌తో అక్టోబర్ 6 నుంచి 11 వరకు, రూ. 500 ఫైన్‌తో అక్టోబర్ 12 నుంచి 16 లోగా చెల్లించే అవకాశముందన్నారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాలని డీఈవో తెలిపారు.

20 నుంచి బాలల సైన్స్ కాంగ్రెస్

సాక్షి, భీమవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఏపీసీఓఎస్‌టీ) ఆధ్వర్యంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ)–2023ను జిల్లా స్థాయిలో సెప్టెంబర్ చివరి వారంలో, రాష్ట్ర స్థాయిలో నవంబర్ రెండో వారంలో, జాతీయ స్థాయిలో డిసెంబర్ చివరి వారంలో నిర్వహించనున్నట్లు డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. భీమవరంలో 20న, తాడేపల్లిగూడెంలో 21న, తణుకులో 22న జిల్లా స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఆయా పాఠశాలల నుంచి ఒక సైన్స్ టీచర్ చొప్పున హాజరుకావాలని సూచించారు. వివరాల కోసం జిల్లా కో–ఆర్డినేటర్ మల్లుల శ్రీనివాస్ (9394238826)ను జిల్లా అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్‌రాజు(9848444282)ను సంప్రదించాలన్నారు.

చంద్రబాబు అరెస్టుపై స్పందన లేదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చంద్రబాబును స్కిల్ స్కామ్‌లో అరెస్టు చేసి 7 రోజులు గడిచినా రాష్ట్ర ప్రజలలో స్పందన లేదని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తి లేనట్టుగా చూపిస్తున్నారని, అయితే చంద్రబాబు అరెస్ట్ సమయంలోను, జైలు నుంచి తీసుకుని రావడానికి ఢిల్లీ నుంచి వచ్చే న్యాయవాదులకు కోట్లాది రూపాయిలు ఇచ్చి ఎలా తీసుకుని వచ్చారని ప్రశ్నించారు.

మహిళా బిల్లుకు మద్దతు హర్షణీయం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



ఉండి నియోజకవర్గ మహిళలతో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు (ఫైల్)

ఆకివీడు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి మరోసారి మహిళా పక్షపాతి అని నిరూపించుకున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సీఎం జగన్ మద్దతు తెలపడం పట్ల మంగళవారం పీవీఎల్ హర్షం వ్యక్తంచేశారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లాలనే ఆలోచనతో జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ వస్తున్నారని పీవీఎల్ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల ఎంపికలో, పార్టీ పదవుల కేటాయింపులో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మహిళల ప్రత్యేక రక్షణ కోసం దిశ యాప్‌ను రూపొందించారని, చట్టం కేంద్ర ప్రభుత్వ అనుమతికి వెళ్లిందన్నారు. మహిళలకు స్థానిక సంస్థల్లో సముచిత స్థానం కల్పించడమే కాకుండా దేశంలో ఏ రాష్ట్రంలో అమలుజేయని విధంగా సంక్షేమ పథకాలు మహిళలకే అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. రేషన్ కార్డు నుంచి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం వరకూ మహిళలకే ప్రాధాన్యత ఉందన్నారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా నిలబడి ఆర్థిక సాధికారిత సాధించే దిశగా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అన్ని విధాలుగా మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న సీఎం జగన్ 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు తెలపడంతో రాష్ట్రంలో మహిళలకు చట్ట సభల్లో తగిన ప్రాతినిథ్యం దక్కుతుందని చెప్పారు.

దాడి కేసులో టీడీపీ నాయకులకు రిమాండ్

ద్వారకాతిరుమల: మండలంలోని గొల్లగూడెంలో వైఎస్సార్‌సీపీ నేత, అతని అనుచరులపై హత్యాయత్నం చేసిన టీడీపీ నాయకులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం... గొల్లగూడెం గ్రామంలో రామాలయం నిర్మాణ విషయంలో రెండేళ్ల క్రితం స్థానిక వైఎస్సార్‌సీపీ నేత ఘంటా వెంకట సుబ్రహ్మణ్యంకు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి వీర వెంకట సత్య వరప్రసాద్‌కు మధ్య వివాదం నెలకొంది. అప్పటి నుంచి వారు రెండు వర్గాలుగా ఏర్పడి, గొడవలు పడుతున్నారు. ఈ నెల 17న రాత్రి వెంకట సుబ్రహ్మణ్యం వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన నిర్వహణ నిమిత్తం పాత రామాలయం వద్ద తన అనుచరులతో కలసి షామియానా పందిరి నిర్మిస్తున్నారు. ఆ సమయంలో సత్య వరప్రసాద్ తన అనుచరులు కొమ్మిన సత్యన్నారాయణ, చిలకా సతీష్, బొంతు వెంకట ప్రసాద్, గంజి సతీష్, కొత్తపల్లి హరికృష్ణ, బొంతు మణీంద్రరావులతో ఘటనా స్థలం వద్దకు వచ్చి కర్రలతో సుబ్రహ్మణ్యం, అతని అనుచరులు బొంతు రమేష్, ఈలప్రోలు ధర్మరాజు, కొత్తపల్లి గురువిష్ణు, కొత్తపల్లి హేమంత్‌పై విచక్షణా రహితంగా దాడి చేసి, హత్యచేసేందుకు యత్నించారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను హుటాహుటీన 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఏలూరు ఆంధ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. దాడికి పాల్పడిన వారిలో చిలకా సతీష్ మినహా మిగిలిన ఆరుగురు టీడీపీ నాయకులను పోలీసులు సోమవారం ఉదయం అరెస్టు చేసి, భీమడోలు కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించారు.



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలారి, జీవీ

క్షతగాత్రులకు పరామర్శ

ఏలూరు ఆంధ్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యం, ఆయన అనుచరులను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకుడు జీవీలు సోమవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. క్షతగాత్రులు గురువిష్ణు, ధర్మరాజులు మాట్లాడుతూ తాము మొదటి నుంచి వెంకట సుబ్రహ్మణ్యం వెంటే నడుస్తున్నామని, తమను టీడీపీ వారిగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే తలారికి, జీవీకి చెప్పారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ కారుమంచి రమేష్, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ శామ్యూల్ ఉన్నారు.

ఏకదంతాయ.. బహురూపాయ



ఏలూరు : కుండీ సెంటరులో భారీ గణేశుడు

తణుకు అర్బన్: కొచ్చెర్లకోట వీధిలో భక్తుల మధ్య భారీ గణనాథుడు

ఉండి: సీతారామపేటలో పూజలందుకుంటున్న వినాయకుడు

తాడేపల్లి గూడెం అర్బన్: గూడెంలో ప్రత్యేకంగా అలంకరించిన వినాయకుడు

సకల విఘ్నాలు తొలగించి శుభాలు అనుగ్రహించే గణనాథుడికి వినాయక చవితి సందర్భంగా సోమవారం అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వివిధ రూపాల్లో కొలువైన విఘ్ననాథుడిని దర్శించుకునేందుకు జనం బారులు తీరారు. స్థానిక నాయకులు, యువత ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీతో పాటు ప్రత్యేక కార్యకమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

ఏలూరు : కుండీ సెంటరులో ఏర్పాటు చేసిన భారీ గణేశుడు

నరసాపురం రూరల్ : పట్టణంలోని కోవెల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం



పెనుగొండ : సిద్ధాంతంలో నిమజ్జన ఊరేగింపు



భీమవరం(ప్రకాశంచౌక్) : 17వ వార్డులో వినాయక చవితి వేడుకలు



పాలకొల్లు అర్బన్: గోల్డ్ మార్కెట్‌లో గణపతికి పూజలు

క్లుప్తంగా

శ్రీవారి ట్రస్టు బోర్డు సభ్యుడిగా రామ్మోహన్ ప్రమాణ స్వీకారం

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డులో ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమితులైన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన ఎం.రామ్మోహన్ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా ఆలయ కార్యాలయంలో ఆయన ఈఓ వేండ్ర త్రినాథరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో ఈఓ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం రామ్మోహన్ కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, స్వామివారి ప్రసాదాలను అందించారు.

రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద వ్యక్తి మృతదేహం

ఏలూరు (టూటౌన్): ఏలూరు రైల్వేస్టేషన్ ఈస్ట్ బుకింగ్ కౌంటర్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎన్.ఆదినారాయణ మంగళవారం చెప్పారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, అనారోగ్యం లేదా ఏ ఇతర కారాణాల వల్ల మృతి చెంది ఉండవచ్చన్నారు. 5.6 అడుగులు ఎత్తు, కోలముఖం, నలుపు ఛాయ, నల్లని జుట్టు, నల్లని గెడ్డం కలిగి ఉన్నాడని, సిమెంట్, పసుపు రంగు గళ్లు ఉన్న తెలుపు రంగు పొడవు చేతుల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించామని, 80740 55378 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని హెచ్‌సీ కోరారు.

రూ.1.56 లక్షల నగదు స్వాధీనం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. 9 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,56,840 నగదు స్వాధీనం చేసుకుని, రెండు కార్లను సీజ్ చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ చెప్పారు.

ఎరువు మోతాదు మించితే.. పంటకు చేటే

- సార్వా వరి సాగులో ఎరువుల అధిక వాడకంతో నష్టం
- రైతులకు విస్తృతంగా అవగాహన కలిగిస్తున్న అధికారులు
- ఆశాజనకంగా వరి పైరు.. కనిపించని చీడపీడల ప్రభావం



భీమవరంలో ఏపుగా పెరుగుతున్న సార్వా వరిపైరు

సాక్షి, భీమవరం: అనుకూల వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ సహాయం రైతులకు అండగా ఉండడంతో జిల్లాలో సార్వా పంట ఆశాజనకంగా ఉంది. అయితే వరి సాగులో మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల అధిక పెట్టుబడితోపాటు పైరుకు నష్టం చేకూరుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా నత్రజని వినియోగం పరిమితికి మించితే అనర్థమేనని స్పష్టం చేస్తున్నారు. తోటి రైతుల కన్నా తన పైరు ఎక్కువగా ఎదగాలనే కాంక్షతో రైతులు యూరియా ఎక్కువగా వినియోగిస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తేలడంతో ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో సార్వా సాగు....

జిల్లాలోని 20 మండలాల పరిధిలో ప్రస్తుత సార్వా సీజన్‌లో సుమారు 2.13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. దీనిలో ఎక్కువగా రైతులు ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, స్వర్ణ రకాల వంగడాలను వేశారు. నాట్లుకు ముందుగానే దమ్ములో ఎకరాకు 50 కిలోల కాంప్లెక్స్, 25 కిలోల యూరియా, నాట్లు వేసిన 25 రోజులు తరువాత 25 కిలోల యూరియా, చిరుపొట్టదశలో 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ ఎరువును మాత్రమే వాడాలని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడడంతో వరిపైరుపై ఎటువంటి చీడపీడల ప్రభావం లేదని, అందువల్ల అనవసరంగా పురుగు మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు.

అధిక ఎరువుల వాడకంతో దిగుబడిపై ప్రభావం

వరిపైరుపై మోతాదుకు మించి ఎరువులు వాడడం వల్ల అధిక పెట్టుబడి అయినా దిగుబడి పెరిగే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా నత్రజని ఎక్కువగా వినియోగించడం వల్ల పైరు ఎత్తుగా పెరిగి పడిపోయే ప్రమాదమేగాక చీడపీడలు కూడా ఆశించే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. సార్వా వరిపైరు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నందున రైతులు వ్యవసాయశాఖాధికారుల

ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే నష్టమే



సార్వా వరి పైరులో ఎరువులు తగినంత తగానే వినియోగించాలి. పక్క రైతులను చూసి ఎక్కువగా ఎరువులు వేయడం వల్ల పైరుకు ప్రయోజనం లేకపోగా నష్టం కలిగిస్తుంది. పైరు చిరుపొట్ట దశలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ తప్పనిసరిగా వినియోగించాలి. దీనివల్ల గింజలు గట్టిగా ఉండి దిగుబడి పెరుగుతుంది.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

త్వరలో కార్మికులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ



జి.రాజేశ్వరి, కార్యదర్శి, ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ

ఏలూరు (టూటౌన్): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం జిల్లా జడ్జి సి.పురుషోత్తంకుమార్ సూచనల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రాబోయే రోజుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద వివిధ రంగాల్లో ఉన్న కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి చెప్పారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సంస్థ భవనంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిపాదిత వాణిజ్యాలలో సాధారణ జీవనోపాధిని అందించడానికి ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిలో ఓడ రేవు ఆధారిత పనులు, నిర్మాణ పనులు, వడ్రంగి, బేకరీ, వ్యవసాయం, టైలరింగ్ వంటి పనులు చేసే కార్మికులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సమన్వయంతో, స్వచ్ఛంద సంస్థల సహకారంతో వీటిని నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి రాజేశ్వరి తెలియజేశారు. రిమాండ్ ఖైదీలకు వర్క్ షాపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ అవేర్‌నెస్ ద్వారా పిల్లల హక్కులు, వాటి సాధన కొరకు చేయాల్సిన పనులపై వివరించనున్నట్లు పేర్కొన్నారు. లిటిగేషన్ ఫ్రీ విలేజెస్ పేరుతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అవగాహన కల్పించే బృందాలు ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా కోర్టుకు రాకముందే చట్టాలపై ప్రజలకు అవగాహన కలుగుతుందన్నారు. ఫిలాంత్రఫిస్టులు ముందుకు వచ్చి జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి కోరారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశం
- పీఆర్ అధికారులతో సమీక్ష సమావేశం

ఏలూరు (మెట్రో): గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాలు అక్టోబర్ నెలాఖరు లోగా పూర్తి చేయాలని చైర్‌పర్సన్ ఇంజనీర్లకు దిశానిర్దేశం చేశారు. సదరు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించిందని, అవి కూడా సరిపోని చోట జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఇంజనీరింగ్ డివిజన్‌లో అత్యధికంగా భవనాలు పూర్తి చేసిన మండల ఇంజనీరింగ్ అధికారులను దుశ్శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఇంజనీర్లు సమాజానికి పునాదులు వంటి వారని, గ్రామాలలో మౌలిక సదుపాయాల రూపకల్పనలో మీ పాత్ర అజరామరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ ఏలూరు సర్కిల్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఏలూరు, రాజమహేంద్రవరం, భీమవరం, పంచాయతీరాజ్ ఈఈ ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మండల అధికారులు పాల్గొన్నారు.

హత్యా ఘటనపై ఎస్పీ సీరియస్

- టూటౌన్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఘటన
- ముందే పసిగట్టడంలో స్టేషన్ అధికారులు విఫలం
- ఇతర వైఫల్యాలపైనా సిబ్బందిపై వేటుకు రంగం సిద్ధం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మరణాయుధాలు



ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్ (ఫైల్)

సాక్షి, భీమవరం: భీమవరంలో పట్టపగలు జరిగిన రౌడీషీటర్ హత్యా ఘటనను ఎస్పీ యు.రవి ప్రకాష్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. టుటౌన్ పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఘటన చోటు చేసుకోవడంతో ఘటనను ముందే పసిగట్టడంలో విఫలమైన టూటౌన్ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి పోలీసులు నిఘా పెంచి పేకాట, గంజాయి విక్రయాలు వంటి వాటిపై ఉక్కుపాదం మోపారు. ఎస్పీ రవిప్రకాష్ నిత్యం పర్యవేక్షణలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉంటున్నప్పటికీ టుటౌన్ ప్రాంతంలో మసాజ్ సెంటర్ల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు, పేకాట శిబిరాలు, గంజాయి అమ్మకాలు, కళాశాలల వద్ద విద్యార్థుల గొడవలు వంటివి సాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది ఉదాసీన వైఖరి కారణంగానే ఈ నెల 17న హత్యా ఘటన చోటుచేసుకుందనే ప్రచారం సాగుతోంది. గత ఏడాది పట్టణానికి చెందిన రౌతుల ఏసు హత్య కేసులో నిందితుడైన పట్టణంలోని బలుసుమూడి గాంభీర్‌దొడ్డికి చెందిన బెవర విజయబాబు (23) హత్యకు గురయ్యాడు. ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌కు విజయబాబు, అతని సోదరుడు గోవిందరావు హాజరయ్యారు. ఈ సమయంలోనే వీరిని హత్య చేయాలనే పథకంతో హంతకులు స్టేషన్ బయట కాపుకాచి ఉన్నట్లు తెలుస్తోంది. విజయబాబు ఎప్పుడు బయటకు వస్తాడోనని కారు, మోటారు సైకిళ్లపై ఉన్న నిందితులను పోలీసులు పసిగట్టలేకపోయారు. కౌన్సెలింగ్ అనంతరం విజయబాబు సోదరుడు గోవిందరావుతో కలసి మోటారు సైకిల్‌పై వెళుతుండగా వెంబడించిన దుండగులు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే కారుతో ఢీకొట్టి వారు కిందపడిపోగానే కత్తులతో దాడి చేసి హత్యచేశారు. గోవిందరావు ఆపదను గ్రహించి వెంటనే పక్కనే ఉన్న పంటకాలువలోకి దూకి స్టేషన్‌కు చేరడంతో బతికి బయటపడ్డట్లు చెబుతున్నారు. అప్పటికే తేరుకున్న ఎస్సై అప్పారావు, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఒకరిని అదుపులోనికి తీసుకున్నా మిగిలినవారు పరారయ్యారు. ఎస్పీ రవిప్రకాష్ దీనిని తీవ్రంగా పరిగణించి సిబ్బందిపై వేటువేయడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారోననే చర్చ పోలీసు వర్గాల్లో జోరుగా సాగుతోంది.

గోదావరికి మళ్లీ వరద



పెరిగిన వరదతో కుక్కునూరులో నీటమునిగిన మిరప చేలు

కుక్కునూరు: గోదావరికి మళ్లీ వరద రావడంతో మండలంలోని రైతులు కలవరం చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రాజెక్టులకు వరద నీరు చేరడంతో తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు విడుదల చేసింది. దీంతో గత రెండు రోజులుగా గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రానికి వరద ప్రవాహం 36 అడుగులకు చేరుకుంది. ఇప్పటికే పెరిగిన వరద వాగుల్లోకి చొచ్చుకురావడంతో మండల కేంద్రంలోని గుండేటివాగు వంతెన నీటమునిగి పలు గ్రామాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా పెరిగిన వరదతో గుండేటివాగుకు ఆనుకుని ఉన్న మిరప చేలు ముంపునకు గురయ్యాయి. ఎన్నడూలేని విధంగా గోదావరి వరద దోబూచులాడుతుండడంతో పంట చేతికి వచ్చేవరకు పరిస్థితులు ఎలా ఉంటాయోనని మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాయన్నపాలెంలో చోరీ



బాధితుడి ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంలో సోమవారం అర్ధరాత్రి ఓ దొంగల ముఠా ఓ ఇంట్లోకి ప్రవేశించి 12 కాసుల బంగారు అభరణాలను దొంగిలించి పరారైంది. బాధితుడు దొంగల ముఠాను పట్టుకునేందుకు విఫలయత్నం చేశాడు. బాధితుడు మేడపాటి గుర్రెడ్డి మంగళవారం భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే... సాయన్నపాలేనికి చెందిన మేడపాటి గుర్రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఇంట్లో వినాయక చవితిని జరుపుకున్నారు. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో ముగ్గురు దొంగలు ఇంట్లోకి చొరబడి తాళాలు వేయని బీరువాలోని రూ.5 లక్షల విలువైన 12 కాసుల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఆ సమయంలో అలికిడి రావడంతో గుర్రెడ్డి భార్య భర్తను నిద్రలేపగా ఆతను దొంగను గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతన్ని తోసేసి బయటకు పరిగెట్టాడు. అప్పటికే రోడ్డు మీద బైక్‌తో సిద్ధంగా ఉన్న ఇద్దరు దొంగలతో కలిసి తోకలపల్లి వైపు పారిపోయారు. గుర్రెడ్డి తన తండ్రితో కలిసి బైక్‌పై కొద్ది దూరం వారిని వెంబడించినా దొంగలు దొరకలేదు. మంగళవారం బాధితుడు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ నిందితుల వేలిముద్రలను సేకరించారు.

అంబులెన్స్ డ్రైవర్‌కు ఏడాది జైలు

చింతలపూడి: శిశువు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆలస్యంగా ఆస్పత్రికి తీసుకువెళ్లి ఆమె మృతికి కారణమైన కేసులో అంబులెన్స్ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.ఐదువేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్సై కె.ప్రసాద్ మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2019వ సంవత్సరంలో చింతలపూడి మండలం పట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఆరు రోజుల చిన్నారిని విజయవాడ ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ డ్రైవర్ అర్జున్ డబ్బులు డిమాండ్ చేయడమే కాక ఆలస్యంగా ఆసుపత్రికి తీసుకువెళ్లడంతో మృతి చెందింది. దీంతో చిన్నారి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాగా సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై కె.ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ కేఎస్‌కే భగవాన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారణకు సహకరించారు. ఈ కేసులో నిందితుడి నేరం రుజువు కావడంతో అతనికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అదనంగా కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, అతనికి సహకరిస్తున్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.మల్లికార్జునరెడ్డి చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పంగిడిగూడెంకు చెందిన ఎస్‌కే మదర్‌బీబీ, వేలేరుపాడు మండలం రేపాకగొమ్ముకు చెందిన ఎస్‌కే బాజీతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహ సమయంలో రూ.1,50 లక్షల నగదు, ఆరకాసు బంగారం కట్నంగా ఇచ్చారు. కొంతకాలంగా ఇంకా కట్నం తీసుకురావాలని బాజీ వేధిస్తున్నాడని, దీనికి మరో ఇద్దరు కుటుంబసభ్యులు సహకరిస్తున్నట్లు మదర్‌బీబీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అలాగే తనను, పిల్లలను ఇంటి నుంచి గెంటి వేశారని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉండి మినహా ఈ-రోల్స్ అప్‌డేషన్ పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, డీఆర్వో కృష్ణవేణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపొందించడానికి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలిపారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి మంగళవారం ఎలక్టోరల్ రోల్స్ - స్పెషల్ సమ్మరీ రివిజన్, 2024 మరణాలు, నకిలీ ఎంట్రీలు, అక్రమాలు, ఫిర్యాదుల పరిశీలన, రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్, ఎపిక్ కార్డ్ జనరేషన్, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, డీఆర్వో కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ఈఆర్‌ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, సీఈవో మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం తొలగించబడిన ఓటర్ల జాబితా ఇంటింటి వెరిఫికేషన్ పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి వివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకుని దిశానిర్దేశం చేశారు. రాజకీయ పార్టీల సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివరిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి నివేదికలు అందజేశామన్నారు. అలాగే ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. ఉండి నియోజకవర్గం మినహా ఎలక్షన్‌కు సంబంధించి ఈ-రోల్స్ అప్డేషన్ అన్ని నియోజకవర్గాలలో పూర్తి చేశామని, ఓటర్ల సవరణ అనంతరం ఈఆర్ఓ ద్వారా పూర్తి చేస్తామన్నారు. మరికొన్ని విచారణ చేయాల్సి ఉందన్నారు. పునఃపరిశీలన వేగవంతం చేస్తున్నామన్నారు. జిల్లాలో తొలగించిన ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్‌లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈనెల సమావేశం నిర్వహించి, తుది జాబితాను ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తామని కలెక్టర్ ప్రశాంతి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.కృష్ణవేణి, భీమవరం ఆర్డీవో దాసి రాజు పాల్గొన్నారు.

కట్నం వేధింపులకు వివాహిత బలవన్మరణం



యమున మృతదేహం



భీమవరంలో యమున మృతి చెందిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: అదనపు కట్నం వేధింపులకు తాళలేక ఓ వివాహిత సోమవారం బలవన్మరణానికి పాల్పడింది. భీమవరం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాళ్ల మండలం మోడి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమార్తె యమున (21)ను కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం దోమలగొంది గ్రామానికి చెందిన తిరుమాని వీరబాబుకు ఇచ్చి 2020 నవంబర్‌లో వివాహం చేశారు. పెళ్లి సమయంలో 20 సెంట్ల పొలం, రూ.2.80 లక్షల నగదు, రూ.10 వేలు ఆడబడుచు కట్నంతోపాటు కొంత బంగారం కూడా ముట్టచెప్పారు. రెండేళ్లపాటు వీరి కాపురం సజావుగా సాగగా వీరికి ఒక బాబు పుట్టాడు. ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్న వీరబాబు నాలుగు నెలల క్రితం భీమవరం మూడో వార్డు కళాభవన్ వీధిలో కాపురం పెట్టాడు. ఇటీవల యమునపై అనుమానం వ్యక్తం చేయడమేగాక ఇంకా కట్నం తీసుకురావాలంటూ ఆమెను మానసిక, శరీరకంగా వీరబాబు వేధించడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం యమున ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ విషయాన్ని యమున తండ్రి వెంకటేశ్వర్లుకు వీరబాబు ఫోన్ చేసి చెప్పడంతో తండ్రి వెంకటేశ్వర్లు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించాడు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు సీఐ అడబాల శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యమున ఇంటిని పరిశీలించిన ఎస్పీ రవిప్రకాష్

వరకట్నం వేధింపులతో యమున ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఇంటిని ఎస్పీ యు.రవి ప్రకాష్ మంగళవారం పరిశీలించారు. కళాభవన్ వీధిలోని గృహాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ బి.శ్రీనాథ్, వన్‌టౌన్ సీఐ శ్రీనులకు తగిన సూచనలు చేసి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని ఆదేశించారు.

భర్త సహా ఆరుగురిపై కేసు

జంగారెడ్డిగూడెం: భార్యను బెదిరించిన ఘటనలో భర్తతో సహా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.మల్లికార్జునరెడ్డి సోమవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతవరం గ్రామానికి చెందిన బందెల మధుకుమార్, సుధారాణిలకు 2014లో వివాహమైంది. వీరికి ఒక పాప. సుధారాణికి వివాహ సమయంలో కట్నం, వివిధ కానుకల రూపంలో రూ.2.50 లక్షలు ఇచ్చారు. 2017లో భర్త మధుకుమార్ అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో భార్యను ఇంటి నుంచి గెంటి వేయగా, పెద్దల సమక్షంలో రాజీ చేశారు. కొంతకాలం కలిసి ఉన్న తరువాత 2021లో ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్‌లో సుధారాణి వేధింపుల కేసు పెట్టడంతో మధుకుమార్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే ఈ నెల 18న సుధారాణి ఆసుపత్రికి వెళుతున్న సమయంలో మధుకుమార్ అడ్డగించి, మరో ఐదురుగురితో కలిసి చంపేస్తానని బెదిరించాడు. ఈ మేరకు సుధారాణి ఇచ్చిన ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

21న అలంపురంలో ఉచిత వైద్య శిబిరం

పెంటపాడు: మండలం అలంపురం గ్రామంలో ఈనెల 21న వెంకట రమణసేవాఛారిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జీఎస్‌ఎల్ ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, పల్మనాలజీ, చెవి, ముక్కు, గొంతు డాక్టర్లు వచ్చి రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. దీంతోపాటు, గుండె వ్యాధులకు సంబంధించి ఈసీజీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఉచితంగా తీస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై దాడులను అరికట్టాలి

తణుకు టౌన్: దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై జరుగుతున్న మతపరమైన దాడులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి కుమార్ కోరారు. మంగళవారం తణుకులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన అంబేడ్కర్ బావజాల వారసుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎస్ వెంకటేశ్వరరావు, ఎస్ మాల్యాద్రిలు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ, ముస్లీం మైనారిటీలపై జరిగే దాడులపై ప్రభుత్వం వ్యవహరించే తీరు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి డైమండ్‌రాజు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపల్లి అంబేడ్కర్, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రవీంద్ర, మల్లిపూడి శివ, కొంబత్తుల వెంకట్రావు, ప్రముఖ కవి నేలపూరి రత్నాజీ, వెన్నపు సుదాకర్, మద్రె అబ్రాహం, జీ సోమశేఖర్, సత్య కృష్ణ, కే వెంకట్రావు, బి ఇమ్మానియేలు, తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

వీరవాసరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయకుదురులో ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ ,షుగర్, థైరాయిడ్, ఫీవర్ తదితర పరీక్షలు నిర్వహించి వైద్యపరమైన అవగాహన కల్పించారు. సర్వే పూర్తయిన అనంతరం గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని గ్రామ సర్పంచ్ గెద్దం భారతి పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ సెంటర్ వైద్యులు పాలా లీల, డి.ఈశ్వరి, సానబోయిన మావుళ్ళమ్మ పాల్గొన్నారు.

పంట కాలువగట్లు శుభ్రం


నరసాపురం: మున్సిపల్ సిబ్బంది మంగళవారం పట్టణంలోని పంట కాలువగట్లను శుభ్రం చేశారు. నరసాపురం-నిడదవోలు ప్రధాన పంటకాలువ గట్లను శుభ్రం చేశారు. బస్టాండ్ ఎదురుగా అలాగే మొగల్తూరు రోడ్డులో కాలువగట్లను శుభ్రం చేశారు. జేసీబీ ద్వారా అడ్డుగా ఉన్న చెట్లను నరికి, చెత్తకుప్పలు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పనులను దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువగట్లను శుభ్రం చేయడం ద్వారా పట్టణ సుందరీకరణ జరుగుతుందని చెప్పారు. మరోవైపు కాలువలో నీటి ప్రవాహం మంచిగా ఉంటుందని వివరించారు.

చెరువు పనుల పరిశీలన

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామపంచాయతీ పరిధిలో వెలగలవారిపాలెం రోడ్డులో అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేస్తున్న గ్రామ పంచాయతీ మంచినీటి చెరువును మంగళవారం గ్రామ సర్పంచ్ తాటిపర్తి ప్రియాంక పరిశీలించారు. మంచినీటి చెరువును అభివృద్ధి పరిచేందుకు ఈ ఏడాది రూ. 1.80 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో తవ్వకం పనులు పూర్తిచేశారు. ఈ చెరువుకు మెయిన్‌రోడ్డు ప్రక్కన గతంలోనే గ్రామపంచాయతీ నిధులతో రేవును నిర్మించారు. ఈ చెరువుకు సమీపంలోనే రాజన్న రంగరాజు నగర్ ఉండటంతో ఆ కాలనీవాసులకు వినియోగించుకునే విధంగా గ్రామానికి చెందిన దాత దొంగ నాగరాజు రూ. 80 వేలు వెచ్చించి తూర్పువైపు గట్టుకు మరో రేవును నిర్మించారు. బ్రాహ్మణ చెర్వు వాసులు మంచినీటి అవసరాలు తీర్చేందుకు ఈ చెరువును అభివృద్ధి చేస్తున్నట్లు గ్రామసర్పంచ్ తెలిపారు.

జైజై గణేశా..

వాడవాడలా గణపతి ఉత్సవాలు



తాడేపల్లిగూడెం రూరల్: పట్టణం వీకర్స్ కాలనీ అబ్బులు కొట్టు సెంటర్‌లో నెలకొల్పిన వినాయకుడు



తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీకృష్ణయోగ ధ్యాన మందిరంలో వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం : గణపతి నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో వాడవాడలా సుందరంగా అలంకరించిన ప్రత్యేక పందిళ్లలో కొలువుదీరిన భారీ గణనాథుల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పత్రులు, పండ్లతో పూజించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నగర ప్రజలు తమ గృహాల్లో పూజలు నిర్వహించుకున్న అనంతరం సాయంత్రం నుంచి తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలోని స్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు చేసి అక్షింతలను అర్చకులు భక్తులకు ఇచ్చి, ప్రసాదాలు పంపిణీ చేశారు. మంగళవారం రెండో రోజు స్వామివార్లు విశేష పూజలు అందుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో మూడో రోజున, మరికొన్ని ప్రాంతాల్లో ఐదో రోజున స్వామి వారి పూజలు ముగించి నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వినాయకుని విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం, పేరిచర్ల మురళీకృష్ణంరాజులు



తాడేపల్లిగూడెం: పట్టణంలో బుల్లెట్‌పై బొజ్జ గణపతి



తణుకు అర్బన్: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వినాయకచవితికి పూజలందుకున్న గణనాథుడు



తణుకుటౌన్: వినాయక చవితి సందర్భంగా వేల్పూరు గ్రామంలో వినాయకుని ఊరేగింపు దృశ్యం



తాడేపల్లిగూడెం అర్బన్: సత్యవతినగర్‌లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్న చిన్నారులు



అత్తిలి: బల్లిపాడు బాలగణపతి మందిరం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెంటపాడు: అలంపురం దేశనాయకుల విగ్రహాల వద్ద పూజలందుకొంటున్న వినాయకుడు

వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : తెదేపా నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ నాయకులు హెచ్చరించారు. స్థానిక ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశాన్ని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తిపై అవాకులు చవాకులు పేలవద్దని తెదేపా నాయకులను హెచ్చరించారు. అవినీతికి పాల్పడి ఆస్తులు కూడకట్టుకొని తెదేపా నాయకులు కన్నుమిన్నుకానకుండా ఉన్నారని దుయ్యబట్టారు. తెదేపా నాయకులు అవినీతి పోటీలకు వెళ్లితే మొదటి బహుమతి సాధిస్తారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మీ స్నేహితులతో పాటు మీలో ఎవరైనా ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం సర్వనాశనం అయిపోతుందని ప్రజలే బాహాటంగా చెబుతున్నారన్నారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చేసిన అభివృద్ధికి ప్రజలు మళ్లీ కొట్టునే ఎమ్మెల్యేగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారతరాజ్యాంగ బద్ధంగా కొట్టు గెలుపొందారన్నారు. తెదేపా నేతలు అహంకారపు మాటలు మానుకోవాలని హితవు పలికారు. అక్రమించిన ప్రజావినియోగ స్థలాల్లో అక్రమంగా భవనాలు నిర్మించి అద్దదారుల్లో ధనార్జన చేశారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే వ్యక్తులు మంత్రి కొట్టుపై విమర్శలు చేస్తే సహించేది లేదని దుయ్యబట్టారు. పేరు కోసం నోటికి వచ్చినట్లు మాట్లాడటం సబబు కాదన్నారు. తెదేపా పార్టీ పరిస్థితి ఏమిటో తెలియక అయోమయంలోకి వెళ్లి ఏంచేయాలో తెలియక వైఎస్సార్‌సీపీ నాయకులపై అసత్య ప్రేలాపనలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే అభిమతంగా మంత్రి కొట్టు ముందుకు సాగుతున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, చింతకాయల సత్యనారాయణ, బొద్దాని శ్రీనివాస్, తెన్నేటి జగ్జీన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



జగన్న సురక్ష పథకాన్ని వినియోగించుకోవాలని ప్రచారం చేస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి, హెల్త్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరమని, ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో 7వ వార్డులో మంగళవారం ఇంటింటా ఆరోగ్య సర్వేలు హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికి కుటుంబ సంక్షేమం, ఆరోగ్య భరోసా కలిప్పించడంలో భాగంగా ఆరోగ్య సురక్ష పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తిస్తారని చెప్పారు. గ్రామంలోను, వార్డుల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారని వెల్లడించారు. దీర్ఘకాలిక అనారోగ్యాలను గుర్తించి ఏరియా, జిల్లా ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారని తెలిపారు. వైద్య శిబిరాలను స్పెషలిస్ట్ వైద్యులచే, పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యులతో పర్యవేక్షణ జరుగుతందని వెల్లడించారు. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల నుంచి సీనియర్ వైద్యులు వస్తారని, ఈ నెల 30వ తేదీన పట్టణంలో వీకర్స్‌కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం ఉంటుందన్నారు.ఇప్పటికే వార్డుల్లో అవసరమైన రోగులకు గుర్తింపు టోకెన్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య రక్ష కరపత్రాలను పంపిణీ చేశారు. ఆరోగ్య కార్యదర్శులు, వలంటీర్లు, ఆశలు పాల్గొన్నారు.

దళిత ప్రచార భేరి యాత్రను జయప్రదం చేయండి



సంతకాల సేకరణ కార్యక్రమంలో కండెల్లి సోమరాజు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళిత రక్షణ భేరి ప్రచార యాత్ర ఈ నెల 21 నుంచి 24 వరకు జిల్లాల్లో పలు మండలాల్లో నిర్వహిస్తున్నందున యాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెంటపాడు మండలంలోని యానాలపల్లిలో ఆయా ప్రజా దళిత సమస్యలపై సంతకాలు సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ దళితులపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధి హామీని అమలు చేయడం లేదని, కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం లేదని తదితర సమస్యలను ప్రస్తావించారు. మరపట్ల చిన్నదానయ్య, జి.గంగరాజు, జి.నాగరాజు, ఎ.లక్ష్మయ్య, దానియేలు, వెంకటేశ్వరరావు, దానమ్మ, మరియమ్మ, అవ్వమ్మ, సుగుణ, సుభద్ర, నాగరత్నం పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



వైఎస్సార్ బీమా పథకంలో మంజూరైన చెక్కును అందజేస్తున్న సొసైటీ అధ్యక్షురాలు, సచివాలయ సిబ్బంది

తణుకు టౌన్: మండలం మండపాక గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన నల్లి వీర్రాజు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ. 1 లక్ష చెక్కును మంగళవారం ఆ కుటుంబ సభ్యులకు సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అందులో భాగమే వైఎస్సార్ బీమా పథకం అని వివరించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తేతలి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

తణుకు టౌన్: పౌష్టికాహారాన్ని పిల్లలకు క్రమం తప్పకుండా అందజేసినప్పుడే మెరుగైన ఆరోగ్యం, పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ తెలిపారు. పోషన్ మహా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాలింత మహిళలకు పోషకాహారంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈకార్యక్రమంలో పోషకాహారం తయారు చేసే విధానాన్ని ప్రదర్శించి వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

ఇరగవరం: పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని తణుకు సీడీపీవో ప్రమోదిని కుమారి తెలిపారు. మంగళవారం ఇరగవరం మండలంలోని రేలంగి పంచాయతీ కార్యాలయం వద్ద పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, చదువు పట్ల పిల్లల ఆసక్తిని పరిశీలించారు. కేంద్రానికి ప్రతి రోజూ పిల్లలంతా వచ్చేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అందజేసే పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలన్నారు. ఆకు కూరలు, పాలు, గుడ్లు, వంటివి తీసుకోవడం వల్ల రక్త హీనత నుంచి రక్షించుకోవచ్చాన్నరు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీవీ మాణిక్యాంబ, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలను అనుసరించాలి



ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సీ సంక్షేమ అధికారి కె శోభారాణి

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను తప్పకుండా అనుసరించాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కె. శోభారాణి ఆదేశించారు. స్థానిక యాగర్లపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో మంగళవారం జిల్లా పరిధిలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు, అత్తిలి, పాలకోడేరు మండలాల పరిధిలోని సంక్షేమ, విద్యా సహాయకులు, ఉద్యోగులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖలోని జిఓనెం. 46కు సంబంధించిన ప్రామాణిక కార్యాచరణ విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ సహాయ అధికారి బి రామాంజనేయరాజు (తాడేపల్లిగూడెం), వసతిగృహాల అధికారులు, సంక్షేమ, విద్యా సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



ముదునూరు పీహెచ్‌కి దాతలు బహూకరించిన కుర్చీలు

పెంటపాడు: ముదునూరు గ్రామంలో ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. ముదునూరు గ్రామంలో స్థానిక పీహెచ్‌సీలో రోగులు కూర్చునేందుకు వీలుగా నాలుగు సెట్‌ల ఐరన్ కుర్చీలను గ్రామానికి చెందిన మిరియాల రంగారావు కుమారులు, సత్యకృష్ణ, నాగరాజలు బహూకరించారు. ఈ కుర్చీలను మంగళవారం డాక్టర్ ఎస్వీ రమణ, గ్రామ సర్పంచ్ భావన ధాన్యలక్ష్మిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధాన్యలక్ష్మి, ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని దాతలను ప్రత్యేకంగా అభినందించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

సాక్షి, భీమవరం: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బిల్లు ఆమోదించడాన్ని సీపీఐ స్వాగతిస్తున్నట్లు ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి అన్నారు. మంగళవారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రిజర్వేషన్లకు మాజీ ఎంపీ, భారత జాతీయ మహిళా సమాఖ్య మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి గీతా ముఖర్జీ పోరాట ఫలితమేనన్నారు. ముందుగా గీతాముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సాధికారత, సమానత్వ సాధనకు మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ 1996 దేవెగౌడ ప్రభుత్వంలో సీపీఐ ఎంపీ గీతాముఖర్జీ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి బిల్లు ఆవశ్యకతను సభలో వివరించి బిల్లు ఆమోదానికి పట్టుపట్టారన్నారు. ఎట్టకేలకు 27 సంవత్సరాల నిర్విరామ పోరాట ఫలితంగా మహిళా రిజర్వేషన్ బిల్లు కేంద్ర కేబినెట్ ఆమోదించడం హర్షణీయమన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య నాయకురాండ్రు జి.మరియమ్మ, జి.శ్వేత, బి.హారిక, బి.స్వర్ణలత, కె.బ్లెస్సీ, కె.గ్రేసీ తదితరులు పాల్గొన్నారు.